ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

ఆదివారం 21 సెప్టెంబరు 2025

వెయ్యి మంది విద్యార్థినులకు సరిపడా
కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణం

- అక్టోబరు 10 వరకు ప్రతిపాదనలు, నమూనాలు సిద్ధం చేయాలి
- డైనింగ్‌హాల్, క్లాస్, స్టాఫ్‌రూమ్స్, లైబ్రరీ, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, ఆడిటోరియం కోసం ప్రతిపాదనలు
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీదర్‌బాబు, వివేక్‌ల దృష్టికి తీసుకెళ్తాను
- నిర్మల ఇక్కడే చదివారు.. నేను కూడా స్టూడెంట్ లీడర్‌గా ఆ రోజుల్లో ఈ కాలేజీకి వచ్చేవాడిని
- ఆనాడు ర్యాగింగ్ నిర్మూలన కోసం నాగలక్ష్మి అనే అమ్మాయి పోరాటం చేసి ఆత్మహత్య చేసుకోవడంతోనే మహిళలకు ప్రత్యేక డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటయ్యాయి
- సంగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాల, హాస్టల్‌ను సందర్శించిన జగ్గారెడ్డి, నిర్మల



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 1000 మంది విద్యార్థినులకు సరిపడా సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్, కళాశాల భవనాల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల, హాస్టల్‌ను శనివారం వారు సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. కళాశాలలో క్లాస్‌రూమ్స్, స్టాఫ్‌రూమ్స్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ ఆడిటోరియం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అక్టోబరు 10వరకు ఎస్టిమేషన్లు, డిజైన్లు సిద్ధం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, వివేక్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. గడిచిన పదేళ్ల తాను అధికారంలో లేనని, ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చేశానని, ఈ పదేళ్ల ఈ ఊరు కోసం చాలెంజ్‌గా తీసుకొని అభివృద్ధి చేస్తానని అన్నారు. రాజకీయాల మీద తనకు పెద్దగా ఆశ లేదని, తమ పార్టీ అధికారంలో ఉన్నందున తను చెబితే సీఎం మినిస్టర్లు వింటారని తెలిపారు. ఒక వ్యక్తిగానే తాను కళాశాలకు వచ్చానని, చాలెంజ్‌గా తీసుకొని ఈ కళాశాలను అభివృద్ధి చేస్తానన్నారు.



మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధిపై సూచనలు ఇస్తున్న జగ్గారెడ్డి

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ



సిద్దిపేట మెరిడియన్ స్కూల్‌లో బతుకమ్మ, దసరా సంబరాలు

పూల జాతరకు వేళైంది. నేటి నుంచి బతుకమ్మ సంరంభం ఆరంభం కానున్నది. తొమ్మిది రోజులు సాగనున్న పూల పండుగ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగియనుంది. వేడుకలకు ఘనంగా జరుపుకునేందుకు ఊరూవాడా సిద్ధమైంది. శనివారం పలు స్కూళ్లల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలను తెలిపారు.



బతుకమ్మ, దసరాకు 356 ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ ఆర్ఎం విజయభాస్కర్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా 356 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నడుపుతున్న బస్సులకు ఈ ప్రత్యేక బస్సులు అదనమని తెలిపారు. మెదక్ రీజినయన్‌లో శనివారం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు, అందులో 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సర్వీసులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఆర్ఎం తెలిపారు. ఈ నెల 21న ఆరు బస్సులు, 22న 25 బస్సులు, 23న 24 బస్సులు, 24న 37 బస్సులు, 25న 33 బస్సులు, 26న 36 బస్సులు, 27న 40 బస్సులు, 28న 41 బస్సులు, 29న 35 బస్సులు, 30న 24 బస్సులు, 31న 24 బస్సులు, అక్టోబరు 1న 17 బస్సులు, 2న 15 బస్సులు నడపనున్నట్టు వివరించారు.

బతుకమ్మ పుస్తకం ఆవిష్కరణ



బతుకమ్మ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతిని ప్రేమించే గౌరవించే గొప్ప సంస్కృతి, సంప్రదాయాల పండుగ బతుకమ్మ అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఉపాధ్యాయురాలు లక్కీరెడ్డి విజయ రూపొందించిన బతుకమ్మ పాటల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ శక్తికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టత, భావి తరాలకు అందించాలని చెప్పారు. సాంకేతికత రావడంతో పుస్తక పఠన సంస్కృతి దూరం అవుతుందన్నారు. తెలంగాణ జీవన విధానాలు, కుటుంబ విలువలు ఈ పండుగలో ప్రతిబింబిస్తాయని చెప్పారు. ముందు తరాలకి ఉపయోగపడే బతుకమ్మ పాటలు, చరిత్ర ఈ పుస్తకంలో ఉట్టి పడేలా పాటలు రూపొందిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండం కవిత, తడిసిన రమాదేవి, పురమాండ సుజాత, మంకాల నాగరాణి, జీడిగం ప్రసన్న, చిలివేణి ఉమా, కళాకారుని భవానీ తదితరులు పాల్గొన్నారు

నవరాత్రోత్సవాలకు రండి

- మంత్రి పొన్నంకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వర్గల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఈ నెల 22 నుంచి ప్రారంభంకానున్న శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వానపత్రికను శనివారం ఆలయ కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి సరస్వతీ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

మొక్క చెక్కలు..!

అడ్డగోలుగా చెట్ల నరికివేత

విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని..

డబ్బులకు కక్కుర్తి పడుతున్న మున్సిపల్ సిబ్బంది

కొమ్మలకు బదులు ఏకంగా చెట్ల మొదళ్లు కొట్టివేత

విషయం తెలిసి మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం

సిద్దిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం సిద్దిపేటలో అపహాస్యం పాలవుతోంది. ఒకవైపు మొక్కలు నాటుతూ కృషి చేస్తుంటే, మరోవైపు కొంతమంది మున్సిపల్ సిబ్బంది డబ్బులకు ఆశపడి ఏపుగా పెరిగిన చెట్లను అడ్డగోలుగా నరికివేస్తున్నారు. దీనిపై పట్టణవాసులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.







సిద్దిపేట పట్టణంలోని జీజీహెచ్ ఆసుపత్రి డివైడర్‌లో నరికివేసిన చెట్లు

25 లక్షలకుపైగా మొక్కలు

దశాబ్ద కాలంగా మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేట పట్టణంలో దాదాపు 25 లక్షలకు పైగా మొక్కలు నాటారు. రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో వివిధ రకాల మొక్కలను పెంచి పట్టణానికి కొత్త శోభ తీసుకొచ్చారు. వీటి నిర్వహణ కోసం మున్సిపల్ బడ్జెట్‌లో 10 శాతం నిధులు ఖర్చు చేస్తున్నారు. అయినప్పటికీ, ఇటీవల కాలంలో చెట్లపై గొడ్డలి వేటు కొనసాగుతోంది. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయనే సాకుతో కొమ్మలను కాకుండా ఏకంగా చెట్ల మొదళ్లను నరికివేస్తున్నారు.

అనుమతుల్లేకుండానే నరికివేత

చెట్లను నరకాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. కానీ సిద్దిపేటలో ఈ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చెట్లు అడ్డుగా ఉన్నాయని ఫిర్యాదు చేస్తే, డబ్బులు తీసుకుని కొందరు సిబ్బంది నరికివేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో చెట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి ఉన్నా, ఇటీవల బదిలీ కావడంతో పర్యవేక్షణ కరువైంది. ఇదే అదునుగా చేసుకుని అక్రమ నరికివేతలు పెరిగాయి.

కమిషనర్ ఆగ్రహం..వాహనం సీజ్

చెట్ల నరికివేతపై సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా ఇలాంటి చర్యలకు పాల్పడటంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అలాగే, చెట్లు నరికివేసేందుకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పట్టణంలో చెట్లను కాపాడాలంటే కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. నాటిన ప్రతి చెట్టుకు నంబర్ వేసి, నరికివేయాలంటే అటవీశాఖ అనుమతిని తప్పనిసరి చేయాలని కోరుతున్నారు. లేకపోతే పట్టణంలోని పచ్చదనం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాచగిరి క్షేత్రం మాస్టర్ ప్లాన్
అనుసరించి అభివృద్ధి చేస్తాం

- ఆలయ పాలకమండలికి హామీ ఇచ్చిన మంత్రి కొండా సురేఖ

వర్గల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, గత ప్రభుత్వంలో ఆలయ పునరుద్ధరణకు రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయ పాలక మండలి సభ్యులకు హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యలయంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు ఆమెను కలిశారు. పాలకమండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా మాస్టర్‌ప్లాన్‌ను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అందుకు మంత్రి స్పందించినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వారు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి విజయరామరావు, పాలక మండలి సభ్యులు చంద నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్, గాలి కిష్టయ్య, రుద్ర శ్రీహరి, తిరుమలరావు, అలయ అధికారులు సుధాకర్ తదితరులు ఉన్నారు.



మంత్రి కొండా సురేఖతో ఆలయ పాలకమండలి

సార్‌కు సర్‌ప్రైజ్

ఉపాధ్యాయుడికి విద్యార్థుల సత్కారం

రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నారని.. 7

వీరబైరాన్‌పల్లిగా మార్చాలి 7

సీఎంకు ఎంపీ చామల వినతి

పండుగకు ఊరెళ్తున్నారా.. జరభద్రం..! 7

డెంగ్యూతో బాలుడి మృతి



యశ్వంత్ (ఫైల్)

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూతో నాలుగో తరగతి విద్యార్థి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్లలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొడకండ్లకు చెందిన ఆత్కూరి మహేష్, లక్ష్మి దంపతులకు కూతురు ఓంశ్రీ, కుమారుడు యశ్వంత్ ఉన్నారు. యశ్వంత్(9)కు ఈనెల 10వ తేదీన జ్వరం రావడంతో గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించి సోమవారం వరకు చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో యశ్వంత్ శనివారం మృతిచెందాడు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పండుగ సెలవులు వచ్చేశాయ్



విద్యార్థులకు పండుగ సెలవులు వచ్చాయి. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల విద్యాలయం నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సొంతూర్లకు ప్రయాణమయ్యారు. సిద్దిపేట బస్‌స్టాండ్ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. దాదాపు 13 రోజులు సెలవులు ఉండడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ తోటి విద్యార్థులకు ఒకరినొకరు వీడ్కోలు చెబుతూ సెల్ఫీలు దిగుతూ సొంతూర్లకు ప్రయాణమయ్యారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్





రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు

రేగోడు సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రేగోడు పోలీసులు పట్టుకుని శనివారం కేసు నమోదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి రేగోడు మండలంలోని పోచారం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బొలేరో వాహనాన్ని పరిశీలించగా బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. రేగోడు మండలం పెద్దతండా నుంచి రేషన్ బియ్యాన్ని నారాయణఖేడ్‌కు తరలిస్తున్నట్టు గుర్తించారు. శనివారం రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల ద్వారా విచారణ జరిపించగా 30క్వింటాల రేషన్ బియ్యంగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి


ప్రశాంత్(ఫైల్)

మనూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండల పరిధిలోని శెల్గిరా గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. గ్రామానికి చెందిన బేగరి లక్ష్మణ్ రెండో కుమారుడు బేగరి ప్రశాంత్(14)కు ఈనెల 17న జ్వరం వచ్చిందని గ్రామంలోని ఆర్ ఎంపీ యూనుస్ వద్దకు తీసుకెళ్లాడు. రెండు ఇంజక్షన్లు ఇచ్చి అనంతరం మందులు ఇచ్చి పంపించాడు. అయినప్పటికీ ప్రశాంత్‌కు జ్వరం తగ్గక పోవడంతో 18న మళ్లీ ఆయన వద్దకే తీసుకు వెళ్లగా సెలైన్ పెట్టి పంపించాడు. దీంతో ఆర్‌ఎంపీ డాక్టర్ యూనుస్ వైద్యం వికటించి, ప్రశాంత్‌కు జ్వరం మరింతగా పెరిగి పోయింది. 19న యూనుస్ వద్దకే తీసుకెళ్లగా, ప్రశాంత్‌కు ఇన్ ఫెక్షన్ అయిందని, అందువల్ల వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఉచిత సలహాలు ఇచ్చి, నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చాడు. ప్రశాంత్‌ను ఉన్నత వైద్యం కోసం బీదర్ తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం వల్ల తన కుమారుడు చనిపోయాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని తండ్రి లక్ష్మణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కోటేశ్వర్‌రావు గ్రామానికి వెళ్లి విచారణ కొనసాగించారు.

లైసెన్స్ లేకుండా మందుల విక్రయం : కేసు నమోదు

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓ ఆర్‌ఎంపీ డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లెపల్లి గ్రామంలో సంగారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఓ ఆర్‌ఎంపీ వద్ద డ్రగ్ లైసెన్స్ లేకుండా పలు రకాల మందులు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు రూ.10 వేల విలువైన యాంటీబయోటిక్స్ తదితర మందులు స్వాధీనం చేసుకున్నట్లు సంగారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా మందుల విక్రయించడం పట్ల కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

విద్యార్థిని గాయపరిచిన ఉపాధ్యాయుడు


చెంపపై గాయాలైన విద్యార్థి హర్షవర్ధన్

చిన్నకోడూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు గాయపరిచిన సంఘటన చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రామంచకు చెందిన పి. హర్షవర్ధన్ ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 18న పాఠశాలలో హిందీ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడు (గంటల ప్రతిపాదికన) సలీం హర్షవర్ధన్‌ను అకారణంగా కొట్టడం (వేళ్లతో చెంపపై రక్కడం)తో గాయాలయ్యాయని విద్యార్థి తండ్రి పర్శరాములు తెలిపారు. ఆ ఉపాధ్యాయుడు గతంలో కూడా తన కుమారుడిని కొట్టాడని ఆరోపించారు. ఈ ఘటనపై ఎంఈవో యాదవరెడ్డికి, పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్ కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

పటాన్‌చెరు సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్తున్న ఓ యువకుడిని టిప్పర్ ఢీకొని దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీశైలం తెలిపిన వివరాలు ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం హంస గ్రామానికి చెందిన నందకుమార్ (22) ఇంద్రేశం పురపాలక పట్టణం సిటీజన్ కాలనీలో బావ లక్ష్మణ్ ఇంటిలో ఉంటున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడ గ్రాండ్‌ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున మోటారు సైకిల్‌పై పాశమైలారం వెళ్తుతుండగా మార్గమధ్యంలో ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు.

చెరువులో పడి యువకుడి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామంలో చోటు చేసకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీపేట రమేష్ (32) గ్రామ శివారులోని రెడ్డి చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. రమేష్ ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.



లక్ష్మికి కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎనిమిదేళ్ల తర్వాత అందిన 'కల్యాణలక్ష్మి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వివాహమైన ఎనిమిదేళ్లకు లబ్ధిదారురాలికి కల్యాణలక్ష్మి చెక్కు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలం ఇసుకపాయల తండాకు చెందిన లక్ష్మి కూతురు వివాహం 2017లో జరిగింది. అప్పట్లోనే కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరైంది. అయినా అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెకు చెక్కు అందించలేదు. ఎలాగైనా కల్యాణలక్ష్మి డబ్బులు అందించాలని స్థానిక నాయకుల ద్వారా ప్రస్తుత ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కోరింది. స్పందించిన ఆయన మెదక్ కలెక్టర్‌తో చర్చించి కల్యాణలక్ష్మి చెక్కు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే శనివారం నారాయణఖేడ్‌లో లక్ష్మికి కల్యాణలక్ష్మి చెక్కును అందించారు. వివాహమైన ఎనిమిదేళ్లకు కల్యాణలక్ష్మి చెక్కు అందడంపై బాధితురాలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, కాంగ్రెస్ నాయకులు నారాగౌడ్, పెనుమండ్లగౌడ్, రవీందర్‌నాయక్, రమేష్ చౌహాన్, నెహ్రూనాయక్, తదితరులు ఉన్నారు.

సిద్దిపేట ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన సిద్దిపేట జిల్లా ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు

సిద్దిపేట సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు సిద్దిపేట జిల్లా జట్టు ఎంపికైందని ఫుట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ నవాబ్ తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు టోర్నమెంట్ నిర్వహించనుండగా, సిద్దిపేట ఫుట్‌బాల్ మైదానంలో శనివారం ఎంపికలను నిర్వహించారు. వివిధ మండలాల నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఆదివారం నుంచి క్యాంపు నిర్వహించనున్నారు.

166 కేజీల ఎండు గంజాయి పట్టివేత



ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రవాణా చేస్తున్న ఎండుగంజాయిని పట్టుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయికి చెందిన గౌస్, షారూబ్‌ఖాన్ ఒడిస్సా రాష్ట్రంలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి కారులో ముంబయికి తరలిస్తుండగా రామచంద్రాపురం ఇక్రిశాట్ టోల్‌గేటు వద్ద శనివారం సీఐ జగన్నాథ్, ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 83 ప్యాకెట్లు కలిపి 166 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో 3.8 కిలోలు..

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో 3.8 కిలోల గంజాయి పట్టుబడింది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం కందమాల్ తాలూకా ఫుల్బాని గ్రామానికి చెందిన భీమల్ లోచన్ పట్నాయక్ (38), ఒడిస్సాలోని కాశీనగర్‌కు చెందిన మోహన్ పండ (29) ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నివాసముంటూ ప్లంబర్లుగా పనిచేస్తున్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై అనుమానస్పదంగా వెళ్తున్న వీరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 3.8కిలోల గంజాయి లభించింది. నిందితులు ఒడిస్సా నుంచి గంజాయి తీసుకొని వచ్చి సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

జైలులో కుదిరిన స్నేహం.. బృందంగా ఏర్పడి చోరీలు

నర్సాపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని నర్సాపూర్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను ఎస్‌ఐ లింగం శనివారం విలేకరులకు వెల్లడించారు. నర్సాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా ముగ్గురు ఒకే స్కూటీపై అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించారు. దీంతో వారిని అదుపులో తీసుకుని విచారించగా చోరీ బయటపడింది. నర్సాపూర్ మండలం ఎర్రకుంటతండాకు చెందిన ముడావత్ అంజయ్య, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నెల్లూరుకు చెందిన కృష్ణరెడ్డి, టేక్మాల్ మండలానికి చెందిన నెమలి శ్రీనివాస్ గతంలో పలు చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లగా... అక్కడ ముగ్గురు స్నేహితులయ్యారు. బయటికి వచ్చిన తరువాత వారు ఒక గ్రూప్‌గా మారి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నర్సాపూర్, సంగారెడ్డి ప్రాంతాల్లో పలు దుకాణాల్లో చోరీ చేశారు. వీరి వద్ద నుంచి స్కూటీ, 20తులాల వెండి, రూ.2వేలు, ఇనుప రాడ్లు, స్క్రూడ్రైవర్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వారం క్రితం మండలంలోని నారాయణపూర్‌లో వరుసగా ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డ కొల్చారం మండలం నాయినిజలాల్‌పూర్‌కు చెందిన నీరుడికృష్ణను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వెల్దుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరి జరిగిన ఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీను ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తన బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి రాగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 5గ్రాముల బంగారం కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకోని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య



మధుసూధన్ రెడ్డి (ఫైల్)

కొమురవెల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగికి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గౌరాయపల్లిలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెద్ది మధుసూదన్‌రెడ్డి(25) శనివారం పురుగుల మందు తాగాడు గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఇంకా ఫిర్యాదు అందలేదని కొమురవెల్లి పోలీసులు తెలిపారు.

అప్పుడు భర్తకు.. ఇప్పుడు భార్యకు..

- ఇద్దరి మృతదేహాలు వెలికి తీసి డీఎన్ఏ టెస్ట్.. రెండూ మిస్సింగ్ కేసులే
- ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి.. తమవాడేనంటూ తీసుకెళ్లి కర్మకాండలు
- డీఎన్ఏ టెస్ట్‌లో మునిపల్లివాసిగా ఫలితం
- హత్యకు గురై కాలిన స్థితిలో మహిళ మృతదేహం
- తీసుకొచ్చి కర్మకాండలు చేసిన కొడుకు.. డీఎన్ఏ టెస్ట్‌లో సరిపోలని వైనం
- తాజాగా మరోసారి మృతదేహం వెలికి తీసి శాంపిల్స్ సేకరణ



అనుసూజ సమాధి తవ్వుతున్న పోలీసులు



అనుసూజ (ఫైల్)

మునిపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ భార్యభర్తలు. వేర్వేరు సమయాల్లో ఇంటి నుంచి కనిపించకుండా పోయారు. జాతీయ రహదారిపై దొరికిన మృతదేహాన్ని ఓ గ్రామానికి చెందిన వారు తమ వాడేనని తీసుకెళ్లి కర్మకాండ చేశారు. తర్వాత ఆ గ్రామానికి వెళ్లిన వారు అక్కడ ఫొటో చూసి.. తమ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇక్కడ శ్రద్ధాంజలి ఘటిస్తూ ఫొటో పెట్టడం ఏంటని బంధువులకు సమాచారం ఇచ్చారు. అప్పట్లో డీఎన్ఏ టెస్ట్ చేసిన పోలీసులు మరణించింది కర్మకాండ చేసిన వారికి సంబంధించిన వ్యక్తి కాదని తేల్చారు. ఆ తర్వాత ఎనిమిదేళ్లకు మరణించిన వ్యక్తి భార్య కూడా కనిపించకుండా పోయింది. ఓ అటవీ ప్రాంతంలో ఓ మహిళ హత్యకు గురై మృతదేహం లభ్యం కాగా, సెల్ ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పూర్తిగా కాలిపోయి ఉండటంతో బంధువులు తీసుకు వచ్చి కర్మకాండలు చేశారు. అయితే, ఆ మహిళ మృతదేహానికి డీఎన్ఏ టెస్ట్ చేయగా, కుమారుడి డీఎన్ఏతో సరిపోలేదు. దీంతో మరోసారి డీఎన్ఏ టెస్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పాతిపెట్టిన శవాన్ని బయటకు తీశారు. ఇలా భార్యాభర్తలు కనిపించకుండా పోవడం, ఇద్దరికీ డీఎన్ఏ టెస్ట్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించి వివరాలు..

సంగారెడ్డి జిల్లా మునిపల్లికి చెందిన చెవుల అనుసూజ(53) 2024 మే 18న కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మునిపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సెల్‌సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టడంతో మెదక్ జిల్లా ఏడుపాయల వద్ద హత్యకు గురైనట్లు తేలింది. మునిపల్లి గ్రామానికే చెందిన బస్వరాజ్ ఆమెకు మాయమాటలు చెప్పి హత్య చేసి, మృతదేహాన్ని తగులబెట్టినట్లు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని జైలు పంపించారు. మరణించింది ఎవరనే విషయం తేల్చడం కోసం అప్పట్లోనే డీఎన్ఏ టెస్ట్ కోసం పది రోజుల తర్వాత శవాన్ని వెలికి తీసి శాంపిల్స్ సేకరించారు. అవి ఆమె కుమారుడైన చెవుల ప్రవీణ్‌తో సరిపోలలేదు. దీంతో మరోసారి డీఎన్ఏ టెస్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం గ్రామంలోని శ్మశాన వాటికలో అనుసూజ సమాధిని ఆమె కుమారుడు చెవుల ప్రవీణ్, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో తవ్వి తీశారు. సదాశివపేట సీఐ వెంకటేశ్, మునిపల్లి ఎమ్మార్వో గంగాభవానీ, ఎస్సై రాజేష్ నాయక్‌ల ఆధ్వర్యంలో సంగారెడ్డి మెడికల్ కాలేజీ డాక్టర్ రాముల నేతృత్వంలో డీఎన్ఏ టెస్ట్ కోసం అవసరమైన శాంపిల్స్ తీసుకున్నారు.

తమవాడేనంటూ..

చెవుల అనుసూజ భర్త చెవుల పద్మారావు ఎనిమిదేళ్ల క్రితం 2016 డిసెంబర్ 4న కనిపించకుండా పోయాడు. అదే సమయంలో ఇదే మండలం పిల్లోడి గ్రామానికి చెందిన మరో వ్యక్తి కూడా అదృశ్యమయ్యాడు. ఈ మేరకు వేర్వేరు మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయి. తర్వాత మండలంలోని బుదేరా గ్రామ శివారు ముంబై జాతీయ రహదారిపై జరిగిన ఓ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అప్పటికే పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయి ఉండగా, ఆ ఇద్దరిలో ఎవరైనా ఉన్నారేమో అన్న కోణంలో పోలీసులు ఇరు కుటుంబాల వారిని పిలిపించి, మృతదేహాన్ని చూపించారు. దీంతో పిల్లోడి గ్రామానికి చెందిన వారు చనిపోయింది తమ వ్యక్తే అంటూ తీసుకెళ్లారు. కార్యక్రమాలు చేసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత మునిపల్లికి చెందిన కొందరు పిల్లోడి గ్రామానికి పని నిమిత్తం వెళ్లారు. అక్కడ చెవుల పద్మారావు ఫొటో కనిపించడంతో తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఫొటో ఇక్కడ ఉండటం ఏమిటని గ్రామంలోని వారికి ఫోన్ చేశారు. ఇక్కడ తాము ఫొటో చూశామని చెప్పడంతో వారు మునిపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు పిల్లోడి గ్రామానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో చనిపోయింది ఎవరనే విషయం తెలుసుకునేందుకు మృతదేహాన్ని వెలికి తీసి డీఎన్ఏ పరీక్షలు చేశారు. దీంతో చనిపోయింది చెవుల పద్మారావుగా తేలడం అప్పట్లోనే సంచలమైంది.

గ్రామంలో తీవ్ర చర్చ

ఎనిమిదేళ్ల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ కనిపించకుండా పోవడం.. ఒకరిని తీసుకెళ్లి కర్మకాండ చేయడం.. తర్వాత పద్మారావుగా తేలడం.. ఇప్పుడు కనిపించకుండా పోయిన అనుసూజ మృతదేహంపై అనుమానాలు ఉండటంతో గ్రామంలో త్రీవ చర్చ జరుగుతోంది. అనుసూజ డీఎన్ఏ టెస్ట్ కుమారుడితో మ్యాచ్ కాకపోవడంతో అసలు చనిపోయింది ఎవరూ.. గతంలో అతని త్రండికి జరిగినట్లే.. ఎవరో చనిపోతే తీసుకొచ్చి కర్మకాండ చేశారా అన్న చర్చ కూడా జరుగుతోంది.

పండుగకు ఊరెళ్తున్నారా.. జరభద్రం..!

- సంగారెడ్డి, మెదక్ ఎస్పీలు పరితోష్ పంకజ్, డీవీ శ్రీనివాసరావు



సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగకు ఊరెళ్లవారు తగు జాగ్రత్తలు పాటించాలని సంగారెడ్డి, మెదక్ ఎస్పీలు పరితోష్ పంకజ్, డీవీ శ్రీనివాసరావు సూచించారు. విద్యా సంస్థలకు దసరా సెలవులు రావడంతో చాలామంది తమ సొంతూళకు వెళ్లే అవకాశముందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని దొంగలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించవచ్చున్నారు. అలాగే ప్రయాణాలు చేసే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

ప్రజలకు పోలీసు వారి సూచనలు

- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం.
- ఊర్లకు వెళ్తున్నప్పుడు పక్కింటి వారిని ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు.
- ఊళ్లకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, ఇంటి బయట ఒక లైటు వేసి ఉంచాలి.
- ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలి.
- ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- సిసి కెమెరాలను ఇంటర్నెట్ కు అనుసంధానం చేస్తే మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకునే వీలుంటుంది.
- ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. తమ ప్రాంతం పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నెంబర్ ఇతర అధికారుల నెంబర్‌లు ప్రజలు తమ సెల్ ఫోన్ లలో ఉంచుకోవాలి.
- అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100 కు గాని సంబంధిత పోలీస్ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలి.
- సుదూర ప్రాంతాల ప్రయాణాలకు వెళుతున్నట్లైతే, సమీప పోలీసు స్టేషన్‌లలో మీ ఫోన్ నంబర్లు ఇచ్చి వెళ్లాలని, తద్వారా ఎలాంటి విపత్కర పరిస్థితులలో నైనా గుర్తించడానికి వీలుగా ఉంటుంది.

బైరాన్‌పల్లిని వీరబైరాన్‌పల్లిగా మార్చాలి

- సీఎంకు ఎంపీ చామల వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మద్దూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిని వీరబైరాన్‌పల్లిగా మార్చాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నిజాం రజాకార్లకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన నెత్తుటి చరిత్ర అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ కదిలించడంతో సైనిక చర్యతో నిజాం లొంగిపోయాడని, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు అందించిన బైరాన్‌పల్లి అమరవీరుల గ్రామాన్ని వీరబైరాన్‌పల్లిగా మార్చాలన్నారు. నాడు బైరాన్‌పల్లిలో జరిగిన మారణహోమం జలియన్‌వాలా భాగ్ ఘటనను తలపించినట్లు వివరించారు. రజాకార్లు 1200 మంది సైన్యంతో ఆగస్టు 27న జనగామ తాలుకా మీదుగా వెల్దండ నుంచి లద్నూరు మద్దూరు మీదుగా బైరాన్‌పల్లికి చేరుకుని 118 మందిని కాల్చి చంపారన్నారు. కూటిగల్‌లో 30 మందిని ఊచకోత కోసి నరమేధాన్ని సృష్టించారన్నారు. ఈ ఘటనకు నాటి బురుజు, మైసమ్మ మర్రి, కూటిగల్‌లోని తూటాల మర్రి నేటికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయన్నారు. బైరాన్‌పల్లి వీరుల పోరాటాల త్యాగాలకు గుర్తుగా చరిత్రను భావితరాలకు తెలిసేలా గ్రామాన్ని వీరబైరాన్‌పల్లిగా మార్చాలని అభ్యర్థించినట్లు తెలిపారు. ఈ విషయంపై సీఎంకు విన్నవించినందులకు ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



పూలు చల్లి శాలువా కప్పి, చాక్లెట్లు తినిపించి..

ఉపాధ్యాయుడికి విద్యార్థుల సత్కారం

రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నారని..

సార్‌కు సర్‌ప్రైజ్..

వర్గల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోజులాగానే ఆ ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి అడుగు పెట్టారు. అంతే విద్యార్థులంతా చుట్టు ముట్టి సార్‌పై పూల వర్షం కురిపించారు. శాలువాతో సత్కరించి, చాక్లెట్ తినిపించి సార్‌ను సర్‌ప్రైజ్‌లో ముచ్చెతారు. కారణం.. ఆ సార్ రైతు కుటుంబాలకు అండగా ఉంటూ వారికి చేయూతనిస్తుండమే. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికిఖాల్సా ప్రాథమిక పాఠశాలలో శనివారం జరింది. ఈ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు పులి రాజు కొన్నేళ్లుగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు అండా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ రైతు ఆత్మహత్య జరిగిన వెళ్లి ఆ కుటుంబం స్థితిగతులు, ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని, దాతల సహకారంతో ఆ కుటుంబానికి చేతనైన సహాయం అందిస్తుంటారు. ఆయన సేవలు పత్రికల్లో కథనాలుగా కూడా అచ్చయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆయన గురించి గొప్పగా చెబుతుంటారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు శనివారం తమ అభిమాన ఉపాధ్యాయుడిని సన్మానించాలని భావించారు. కొందరు ఇంటి నుంచి పూలను తీసుకువచ్చారు. మరికొందరు శాలువ, చాకెట్లు ఇలా తీసుకువచ్చారు. శనివారం ప్రేయర్ కాగానే ఉపాధ్యాయుడు పులి రాజు నాలుగో తరగతి గదిలోకి రాగానే విద్యార్థులంతా కలిసి ఆయనపై పూలు చల్లారు. కుర్చీలో కూర్చొబెట్టి శాలువతో సన్మానించి, చాక్లెట్ తినిపించడంతో సదరు ఉపాధ్యాయుడు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'మీరు రైతులకు చేస్తున్న సేవలు చూసి, సన్మానం చేయాలనిపించింది' అన్నారు.

రేపటి నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- పరీక్షకు హాజరుకానున్న 893 మంది అభ్యర్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సీ కోర్సు అభ్యాసకులకు సప్లిమెంటరీ(థియరీ)పరీక్షలు ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. రెంగ్యుర్ మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పదో తరగతి ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, అదే విధంగా ఇంటర్మీడియట్ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ 621 మంది, ఎస్ఎస్‌సీ 272 మంది, మొత్తం 893 మంది అభ్యాసకులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. పరీక్ష సమయం కంటే గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి నిషేధిత మెటీరియల్‌కు అనుమతి ఉండదని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తి వివరాలకు 08455-276434, 8008403635 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా జడ్జి సంగారెడ్డి జైలు ఆకస్మిక తనిఖీ

కంది, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర శనివారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సెంట్రల్ జైలు నందు ఉన్న బ్యారక్‌లు, గదులు, వంటగది, బాత్రూంలు, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూసి, ఖైదీల కోసం వండే కూరగాయలు, బియ్యం, ఉన్న స్టోర్‌రూమ్‌తో పాటు జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఆమె తనిఖీలు చేశారు. అనంతరం ఖైదీలను జైలులో ఉన్న సదుపాయాలను, భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని ఖైదీలకు కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచించారు. ఖైదీలకు సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. ఖైదీల కేసులు పరిష్కరించేందుకు, న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలిపారు. ఆమె వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, జైలు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష

విద్యార్థుల ఆవిష్కరణలు వెలికితీసే అవకాశం

ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకాలు

ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

ఈ నెల 30 వరకు దరఖాస్తుకు చాన్స్



2025 - 26

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న ఆవిష్కరణలను పదును పెట్టేలా, పరిశోధనలు, ప్రయోగాలలో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం 'విద్యార్థి విజ్ఞాన మంథన్(వీవీఎం)' అనే జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం కూడా ఈ పరీక్షకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంస్థలు సంయుక్తంగా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు భారతదేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థలలో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంది.

పరీక్ష, ప్రోత్సాహకాలు

సైన్స్ సబ్జెక్టు పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగించడమే ఈ పరీక్ష ప్రధాన లక్ష్యం. పరీక్ష రెండు విభాగాలలో ఉంటుంది. జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు, సీనియర్ విభాగంలో 9, 10, 11 (ఇంటర్ మొదటి సంవత్సరం) తరగతుల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావచ్చు. తెలుగు, ఇంగ్లిష్, హిందీతో పాటుగా 14 భాషల్లో ఈ పరీక్షను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇస్రో, డీఆర్‌డీవో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ, ఐఐఎస్ఈఆర్, ఐఐసీటీ, ఎన్ఐఎన్ వంటి జాతీయ పరిశోధన సంస్థలలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం లభిస్తుంది. అంతే కాకుండా, పలు స్కాలర్‌షిప్‌లను కూడా అందజేస్తారు. పాఠశాల స్థాయిలో 18 మందిని ఎంపిక చేస్తారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2వేల ఉపకార వేతనం, సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల్లో మొదటి బహుమతిగా రూ.26వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందిస్తారు. 'భాస్కర స్కాలర్‌షిప్' పేరుతో ఏడాది పాటు నెలకు రూ.2 వేలు చెల్లిస్తారు.

పరీక్షకు హాజరయ్యేలా చూడాలి



విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచి, కొత్త ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడానికి వీవీఎం పరీక్ష ఉపయోగపడుతుంది. విద్యార్థులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో పాల్గొనడం జిల్లా విద్యార్థులకు ఒక మంచి అవకాశం.

- కల్లెపల్లి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి

దరఖాస్తు విధానం

విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రూ.200 చెల్లించి విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభంకాగా, ఈ నెల 30 వరకు గడువు ఉన్నది. పరీక్ష జరిగే రోజున విద్యార్థులు తమ వద్ద అందుబాటులో ఉన్న మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ వంటి డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని నుంచి ఒక నిర్దేశిత అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ అప్లికేషన్ ద్వారా పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఎక్కడి నుంచైనా పరీక్షకు హాజరు కావచ్చు. ఈ పరీక్ష సాధన కోసం వెబ్‌సైట్‌లో పుస్తకాలు కూడా అందుబాటులో ఉంటాయి. లెవెల్ 1కు సంబంధించిన పాఠశాల స్థాయి పరీక్షలు అక్టోబర్ 28 నుంచి 30 వరకు, జిల్లా స్థాయి పరీక్ష నవంబర్ 19న, జాతీయ స్థాయి పరీక్ష 2026 మే నెలలో ఉంటాయి.




సిద్దిపేటలోని కాకతీయ స్కూల్, వికాస్ హైస్కూళ్లలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినుల సందడి




హుస్నాబాద్‌లోని మాంటిస్సోరి, సీవీ రామన్ స్కూళ్లలో బతుకమ్మ వేడుకలు

అలరించిన ముందస్తు సంబురాలు



చేర్యాలలోని విజన్ గ్రామర్‌స్కూల్లో..

తెలంగాణ సంప్రదాయానికి అద్దం పట్టేలా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు దసరా, బతుకమ్మ పండుగల సెలవుల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ముందస్తుగా పర్వదిన సందడి నెలకొన్నది. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, వారి తల్లులతో కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటిని ఆయా పాఠశాలలకు తీసుకువచ్చి బతుకమ్మ ఆటపాటలతో సంబురాలను కనులపండువగా జరుపుకున్నారు. అనంతరం సమీపంలోని జలాశయాల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పలు పాఠశాలల్లో బతుకమ్మ, దసరా పండుగ గొప్పదనాన్ని తెలిపేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

-న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి)



మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ పాఠశాలలో ..



రాయపోల్ మండలం వడ్డెపల్లి పాఠశాలలో..



వర్గల్ ప్రాథమిక పాఠశాలలో ..



దౌల్తాబాద్: గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో వేడుకల్లో బతుకమ్మలతో ఉపాధ్యాయులు విద్యార్థులు



కుకునూరుపల్లి: వేద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, యాజమాన్యం

న్యూస్ బాక్స్

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా సంక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు శనివారం చేర్యాల మండలం చిట్యాలలో కళాప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా కళాకారులు పిస్సింటి రత్నం, పిల్లిట్ల శ్యాంసుందర్, సునువాల కనకయ్య తదితరులు ఆట,పాటలతో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

పంట వివరాలు తెలియజేయాలి

జగదేవ్పూర్ :సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంటల నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వసంతరావు గొల్లపల్లి గ్రామంలో పరిశీలించారు. రైతులందరూ తాము వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవడానికి సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారికి తెలియజేయాలని సూచించారు. పత్తి వేసిన రైతులందరూ కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్వీయ నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో జగదేవ్‌పూర్ మండలంలో పత్తి 14,230 ఎకరాల్లో, వరి 10,028 ఎకరాల్లో, మొక్కజొన్న 225 ఎకరాల్లో, కంది 58 ఎకరాల్లో, కూరగాయలు 155 ఎకరాల్లో సాగవుతుందని వివరించారు.

ఖరీఫ్ పంట నమోదును ప్రారంభించాలి

హుస్నాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 4 నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ అధికారులు పంట నమోదు ప్రక్రియ చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వసుందని సీపీఎం నియోజకవర్గ నాయకులు జి శివరాజ్ తెలిపారు. శనివారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. పంట నమోదు చేయకపోవడం వల్ల రైతులు పంటలను విక్రయించడానికి ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. పంట నమోదును వెంటనే ప్రారంభించాలని, లేనట్లయితే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

మర్కుక్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్‌లో విద్యార్థులకు ఐడీకార్డ్స్, టై, బెల్ట్, బ్యాడ్జ్‌లను ఉచితంగా అందజేశారు. దాత మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం సౌజన్యంతో పాఠశాలలో చదువుతున్న 221 మంది విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు.

కొండపోచమ్మ ఆలయానికి రోటరీ క్లబ్ చేయూత

ములుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు మండల కేంద్రంలోని పోచమ్మ గుడి ఆలయం వద్ద రోటరీ క్లబ్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బోరును తవ్వించారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

చేర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలకేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ చేర్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట జిల్లా రెవిన్యూ అధికారి నాగమణికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లాకార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ.. ఇక్కడ ప్రమాదం సంభవిస్తే సుమారు 40కిలోమీటర్ల దూరం నుంచి అగ్నిమాపకవాహనం వచ్చేసరికి తీరని నష్టంసంభవిస్తుందన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సిద్దిపేట రూరల్,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం పెన్షన్ల పెంపును అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దండు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వీహెచ్‌పీఎస్ అధ్వర్యంలో పెన్షన్‌దారులు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తు గ్రామ పంచాయతీల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో

వెరిటాస్ సైనిక్ స్కూల్ ప్రతిభ



క్రీడాకారులు, కోచ్‌లను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ శేషారెడ్డి

ములుగు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి రజత పథకాన్ని గెలుచుకున్నారని వెరిటాస్ సైనిక్‌స్కూల్ చైర్మన్ డాక్టర్ బి. శేషారెడ్డి తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులను, కోచ్‌లు శంకర్, నరేశ్‌లను ఆయన సన్మానించి, అభినందించారు. బిహార్ రాష్ట్రంలోని రోహతక్‌లో నారాయణ్ వరల్డ్ స్కూల్‌లో సెప్టెంబరు 13 నుంచి 17వరకు జాతీయస్థాయి సీబీఎస్‌ఈ క్లస్టర్స్ అండర్-17 బాలుర కబడ్డీ పోటీలను నిర్వహించగా, తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు లీగ్ దశ నుంచి ఫైనల్‌కు చేరారు. ఫైనల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీగురు హరికృష్ణన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో45-52 పాయింట్స్‌తో వెనుకబడి రన్నర్స్‌గా నిలిచి రజత పథకాన్ని సాధించారు. పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ క్రీడాకారులను, కోచ్‌లను అభినందిస్తూ... వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కబడ్డీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సీబీఎస్‌ఈ పాఠశాలల నుంచి ఇప్పటివరకు ఎవరూ సాధించని జాతీయస్థాయి పతకాన్ని సాధించారని తెలిపారు. వారితో పాఠశాల డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ పీఆర్‌ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ యస్. నాగార్జున ఉన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే విమర్శలు మానుకోవాలి

దౌల్తాబాద్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలకు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పరామర్శల కోసం వచ్చి కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యల చేయడం తగదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు హెచ్చరించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి నిరుపేద ప్రజలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అందరూ అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బండారు లాలు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

దౌల్తాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారం తీసుకోవడం ద్వారానే కిశోరబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డీపీఏ రాము, దుబ్బాక ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ గిరిజ అన్నారు. శనివారం దౌల్తాబాద్ పరిధిలోని గొడుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన

మిరుదొడ్డి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండాపూర్‌లో శనివారం జిల్లా న్యాయమూర్తి రమాదేవి ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జిమిలింద్ కాంబ్లే, న్యాయవాదులు యోగిందర్, కవితా, రవి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులున్నారు.

ఎర్రవల్లిలో కబడ్డీ శిక్షణ ప్రారంభం

మర్కుక్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ కమ్యూనిటీ ఫంక్షన్‌హాల్‌లో కబడ్డీ శిక్షణ శిబిరం తేదీ 19-9-2025 నుండి 24-9-2025 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి కుంట సత్యంలు తెలిపారు. ఈ శిక్షణ అనంతరం ఈ నెల 25 నుండి 28 వరకు నిజాంబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు.

కబడ్డీ పోటీల్లో దూళిమిట్ట క్రీడాకారుల ప్రతిభ

మద్దూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎస్జీఎఫ్ క్రీడోత్సవాల్లో భాగంగా అండర్ 14 విభాగంలో దూళిమిట్ట పాఠశాలకు చెందిన బాలికలు కబడ్డీలో ప్రతిభ కనపర్చి మూడో స్థానంలో నిలిచారు. ఈ మేరకు విద్యార్థులు సుమేరా, సింధు, మేఘన జోనల్ స్థాయికి ఎంపికవ్వడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సతీష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తడి నీరు వెళ్లేందుకు పరిష్కారం చూపాలి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై నీళ్లలో నిలబడి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఊరచెరువు మత్తడి నీరు వెళ్లేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ నాయకులు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై ఊర చెరువు నుంచి వస్తున్న మత్తడి నీటిలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఊర చెరువు మత్తడి కాలువలను మూసి వేయడంతో పలు కాలనీలు, ఆసుపత్రులు ముంపునకు గురవుతున్నాయన్నారు. వెంటనే ఈ సమస్యకు జిల్లా కలెక్టర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసి వారం గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

వారివెంట నాయకులు కుడిక్యాల రాములు, టెలికాం బోర్డు సభ్యులు కమ్మరి శ్రీనివాస్, నత్తి శివకుమార్, జిల్లా రమేశ్‌గుప్తా, చెప్యాల వెంకట్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, రామచంద్రాచారీ, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల వేగవంతానికి చర్యలు: జడ్పీ సీఈవో



మద్దూరు పీహెచ్‌సీలో స్లాబును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

మద్దూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని జడ్పీసీఈవో రమేష్ సూచించారు శనివారం మద్దూరు, దూళిమిట్ట మండలాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీడీవో ఎస్. రాంమోహన్, ఎంపీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ సహనీ, పీఆర్‌ఏఈ గౌస్ మోహియుద్దీన్‌తో చర్చించారు. మద్దూరులో 50 శాతంపైన పనుల పురోగతి ఉన్నప్పటికిని పూర్తి స్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడి వంద శాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని తెలిపారు. అలాగే మద్దూరు, లద్నూరు పీహెచ్‌సీల్లో కొనసాగుతున్న రెనోవేషన్ పనులపై ఆరా తీశారు. అనంతరం మద్దూరు పీహెచ్‌సీలో పనుల్ని పరిశీలించి స్లాబుపైన ఫ్లోరింగ్ చేయించాలని సూచించారు.

మైనార్టీలకు నూతన పథకాలు ప్రవేశపెట్టడం హర్షనీయం

సిద్దిపేట సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి మైనార్టీలకు నూతన పథకాలు ప్రవేశపెట్టడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు వహీద్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని మైనారిటీ వితంతువులకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా వారికి రూ. 50 వేల ఆర్థికసాయం చేయడం, అలాగే రేవంతన్న కా సహారా ద్వారా కొందరికి మోపెడ్ వాహనాల కోసం రూ. లక్ష గ్రాంట్ మంజూరీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రెండు పథకాల కొరకు ఈ నెల 19 తేదీ నుండి టీజీఏబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మైనారిటీ వర్గాలకు పథకాలను అందజేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబెదుల్లాహ్ కొత్వాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుల వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి



రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు

సిద్దిపేట సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీ, కుల వృత్తిదారుల సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలంటూ తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను సిద్దిపేటకు చెందిన బీసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరబాద్‌లో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను బీసీ బహుజన సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాల ఆత్మగౌరవంతో పాటు బీసీలు, బీసీ వృత్తిదారుల అభివృద్ధి కోసం చైర్మన్ దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లానని తెలిపారు. ఆయా అంశాలపై సానుకూలంగా స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ ఆయా వృత్తిదారుల సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

డ్రెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్న కమలాయపల్లివాసులు



పైప్‌లైన్ గుంతను తవ్వుతున్న స్థానికులు

చేర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాయపల్లి గ్రామంలో మురుగు నీటి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు చేయి చేయి కలిపారు. వ్యక్తిగతంగా డబ్బులు జమ చేసుకుని మురుగునీటి సమస్యకు చెక్ పెట్టారు. ఈ సందర్భంగా గ్రామ బీసీకాలనీలోని గాంధీచౌక్ చౌరస్తా నుంచి కొలుపుల ఐలయ్య ఇంటి వరకు సుమారు 20మంది కలిసి రూ.1.20లక్షలు జమచేసుకుని స్వయంగా గోతులు తీసుకుని డ్రైన్ పైప్‌లైన్ వేసుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంపై మండిపడ్డారు.

కడవేరుగు జడ్పీఎస్‌ఎస్‌లో బాలచెలిమి గ్రంథాలయం ఏర్పాటు



పుస్తకావిష్కరణ చేస్తున్న కడవేరుగు జడ్పీఎస్ఎస్ హెచ్‌ం రాజమణి

చేర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీసంస్థ ఆధ్వర్యంలో చేర్యాల మండలం కడవేరుగు జడ్పీఎస్‌ఎస్‌లో ఏర్పాటుచేసిన బాలచెలిమి గ్రంథాలయాన్ని శనివారం పాఠశాల హెచ్‌ఎం రాజమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలలవికాసానికి పాటుపడుతూ చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమైనవన్నారు. విద్యార్థులలు బాలచెలిమి గ్రంథాలయా న్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ మణికొండ వేదకు మార్, కన్వీనర్ గరిపల్లి అశోక్, ఉపాధ్యాయులు గుళ్లపల్లి కాంతికృష్ణ, చంద్రశేఖర్‌రావు, రమేశ్, కృష్ణమూర్తి, లింగాచారి, మమత, సాజిదా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా చేర్యాల మండలం అర్జునపట్ల జడ్పీఎస్‌ఎస్‌కు చెందిన పలువురు 9వ, 10వ తరగతి విద్యార్థులు రచించిన బతుకమ్మ పాటలపుస్తకాన్ని హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

స్వచ్ఛతాహీ సేవపై వినూత్న ప్రదర్శన



చెత్త బుట్టలతో ఎస్‌హెచ్‌ఎస్, కూల్ డ్రింక్ మూతలతో ఏర్పాటు చేసిన హుస్నాబాద్

హుస్నాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం రాత్రి స్వచ్ఛతాహీ సేవపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా వినూత్న ప్రదర్శన ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్త బుట్టలతో పాటు కూల్‌డ్రింక్ మూతలను ఉపయోగించి ఎస్‌హెచ్‌ఎస్ ఆకారంలో ప్రదర్శించారు. చెత్త విభజన చేయకపోతే పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, భావి తరానికి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే చెత్తను వేరు చేసి ఇవ్వాలనే అంశంపై దీనిని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులున్నారు.

మీ సేవా కేంద్రాల్లో అధికంగా వసూలు చేస్తే చర్యలు

- జిల్లా ఈ డిస్ట్రిక్ మేనేజర్ కమటం ఆనంద్‌కుమార్

సిద్దిపేట సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా ఈ డిస్ట్రిక్ మేనేజర్ కమటం ఆనంద్‌కుమార్ హెచ్చరించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని పలు మీ సేవా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సరైన సేవలు చేయాలని మీసేవ ఆపరేటర్లకు సూచించారు. ధరల పట్టిక, సేవలకు కావలసిన పత్రాలతో కూడిన పోస్టర్లను ప్రజలకు కనపడేలా అతికించాలని ఆపరేటర్లను ఆదేశించారు. అధిక వసూళ్లకు పాల్పడితే టోల్ ఫ్రీ నంబరు 1100, ఆధార్ సర్వీసుల టోల్ ఫ్రీ నంబరు 1947, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నారాయణరావుపేటలో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

సిద్దిపేట రూరల్/కుకునూరుపల్లి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి తెలిపారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో స్వచ్ఛనారి సంసత్పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ పాండు రంగాచారి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఐకేపీ మహిళలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు ప్రత్యేక వైద్య నిపుణులు మహిళలకు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు.

విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలి



జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్ రెడ్డి

జగదేవపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఇంటర్ బోర్డు ద్వారా ప్రసారమవుతున్న ఫిజిక్స్ వాలా కాన్ అకాడమీల ద్వారా పోటీ పరీక్షలైన ఎంసెట్, నీట్, ఐఐటి పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీఐఈవో రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో వివిధ రికార్డులను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, లెక్చరర్స్ చాందీ కుమారి, శ్రీలత, శ్రీనివాస్, శ్రీధర్, మోహన్ దాస్, వీవీ ఎన్ చార్య, శ్రీనివాస్ రావు, స్వామి, శేఖర్ తదితరులున్నారు

బతుకమ్మ, దసరా ఏర్పాట్లపై అఖిలపక్ష సమావేశం



పండుగల ఏర్పాట్లపై సమావేశమైన అఖిలపక్ష నాయకులు

హుస్నాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చించారు. ఎల్లమ్మ చెరువు వద్ద జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలు, దసరా సందర్భంగా రామ్‌లీలా కార్యక్రమాలపై అభిప్రాయాలు తీసుకున్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ, సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, డొడ్డి శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.